క్లుప్తంగా

9 నుంచి కల్యాణ వేంకటేశుని ఆలయ వార్షికోత్సవాలు



కేజే పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి

మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 14వ వార్షిక కల్యాణోత్సవాలు వచ్చే నెల 9 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేట రామకొండలరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 9న స్వామి వారి పెండ్లిరాటతో ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. 17న స్వామివారి కల్యాణం నిర్వహించి, మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన జరపనున్నట్లు పేర్కొన్నారు. 22న పౌర్ణమి చక్రస్నానం, నాగవల్లి సంబరాలు, పుష్పాంజలి, ఊంజల్ సేవ తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరాలు



విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్ నేర్పిస్తున్న గ్రంథాలయాధికారి వరలక్ష్మి

రోలుగుంట: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గ్రంథాలయాధికారి ఎస్.వరలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతున్న శిబిరంలో ఆదివారం విద్యార్థులతో చిత్రాలకు రంగులు వేయించారు. ఆంగ్లం గ్రామర్ అంశాలను పరిచయం చేశారు. బాలికలకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్ని శిక్షణ శిబిరాల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

పైడిమాంబ భారీ ప్రభ



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రభ

కె.కోటపాడు: చౌడువాడ గ్రామ దేవత పెద పైడిమాంబ అమ్మవారి పండగలో భాగంగా ఆదివారం భారీ ప్రభను ఏర్పాటు చేశారు. ఐదేళ్లకోసారి నిర్వహించే అమ్మవారి పెద్ద పండగకు అమ్మవారి వివిధ రూపాలతో కూడిన భారీ ప్రభలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ఈసారి కూడా దాదాపు 50 అడుగుల ఎత్తైన ప్రభను అమ్మవారి చిత్రాలతో తయారు చేశారు. దీన్ని గ్రామ పెద్దలు, భక్తులు గ్రామంలో నిలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

మోదమాంబ మాలధారణ



వీరవల్లి అగ్రహారంలో మోదమాంబ మాలధారణలో పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: మండలంలోని వీరవల్లి అగ్రహారం అమ్మవారి పీఠం వద్ద ఆదివారం 10 మంది భక్తులు మోదమాంబ మాలధారణ చేశారు. గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాకపల్లి, సమీప గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి మాలను ధరించారు. వచ్చే నెల 17 వరకు మాలాధారణలో రోజూ ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు.

తాగునీటికి నిశ్చింత

- నిరాటంకంగా తాగునీటి సరఫరా
- శివారు కాలనీలకు ట్యాంకర్లతో నీరు



ట్యాప్‌లు తొలగించడంతో వృథాగా పోతున్న తాగునీరు



ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్న మున్సిపల్ నీటి సరఫరా విభాగం సిబ్బంది

నర్సీపట్నం: పట్టణ వాసులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పురపాలక అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. తరచూ ఏదో ఒక ప్రాంతంలో పైప్‌లైన్లు మరమ్మతులకు గురవుతున్నా, తక్షణ మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూస్తున్నారు. వేసవి ఆఖరులో ఎండలు మండుతుండడంతో తాగు నీటికి ఇక్కట్లపై ముందుగానే అప్రమత్తమయ్యారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో నిరాటంకంగా నీటి సరఫరా చేసి, ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు.

రోజుకు 3.25 ఎంఎల్‌టీ సరఫరా

మున్సిపాలిటీ పరిధిలో 75 వేల మంది జనాభా నివసిస్తున్నారు. నిబంధనల మేరకు రోజుకు 6 ఎంఎల్‌టీ(మిలియన్ లీటర్ల) నీటిని సరఫరా చేయాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులతో 3.25 ఎంఎల్‌టీ మాత్రమే సరఫరా చేస్తున్నారు. సగటున రోజుకు మనిషికి 40 లీటర్లు చొప్పున శుద్ధి చేసిన తాగునీరు అందిస్తున్నారు. మున్సిపాలిటీలో 320 చేతిపంపులు(బోర్లు), 12 వేల పబ్లిక్ కొళాయిలు ఉన్నాయి. కొళాయిలకు మున్సిపల్ అధికారులు ట్యాప్(హెడ్)లు ఏర్పాటు చేస్తున్నా, ఎక్కువ ధార వస్తుందనే ఉద్దేశంతో వాటిని తొలగిస్తున్నారు. దీంతో చాలా చోట్ల తాగు నీరు వృథా అవుతోంది.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం క్లోరిషన్ వెల్ నుంచి నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి వచ్చే ప్రధాన పైపులైను తరచూ ఎక్కడో చోట మరమ్మతులకు గురవుతుంటుంది. మరిడమ్మ గుడి, శారదానగర్, అబిద్ సెంటర్, పోలీస్ స్టేషన్, పెదబొడ్డేపల్లి మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో లీకేజీలతో అప్రమత్తమైన అధికారులు పైప్ లైన్ల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. తాగునీటికి అటంకం లేకుండా చూస్తున్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

మున్సిపాలిటీలో అయ్యన్నకాలనీ, పెదబొడ్డేపల్లి థెరిస్సా కాలనీల్లో పబ్లిక్ కొళాయిలు లేవు. దీంతో ప్రత్యేక ట్యాంకర్లతో ప్రస్తుతం తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ఐదు సార్లు ట్యాంకర్లతో ఆయా కానీలకు నీటిని అందిస్తున్నారు. వేసవిలో స్థానిక ప్రజలు తాగునీటి ఇబ్బందులకు గురవకుండా అధికారులు ముందుగానే అప్రమత్తమయ్యారు. మరీ అవసరమనుకున్న చోట అదనపు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు.

తాగు నీటికి ఇబ్బంది లేదు



వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాం. చేతి పంపులు అన్నింటినీ వినియోగంలోకి తెచ్చాం. పైప్ లైన్ల మరమ్మతులు ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నాం. దుగ్గాడ, ఉత్తరవాహిని పంప్ హౌస్‌ల వద్ద నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. అవసరమైతే ట్యాంకర్లను మరింత పెంచుతాం.

– పి.రవిబాబు, కమిషనర్, నర్సీపట్నం మున్సిపాలిటీ

కాలీఫ్లవర్ సాగుపై రైతుల ఆసక్తి



ములగపూడిలో సాగు చేస్తున్న కాలీఫ్లవర్ పంట

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- ఏజెన్సీకే పరిమితమైన పంట.. మైదాన ప్రాంతంలోనూ సాగు



కాలీఫ్లవర్

నాతవరం: ఒకప్పుడు ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కువగా సాగు చేసే కాలీఫ్లవర్ పంట ఇప్పుడు మైదాన ప్రాంతాల్లోనూ రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే కాలీఫ్లవర్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు.

మండలంలోని ములగపూడి, బెన్నవరం, మాధవనగరం గ్రామాల్లో వ్యవసాయ బోర్ల సాయంతో రైతులు కాలీఫ్లవర్ సాగు చేస్తున్నారు. మండలానికి సరిహద్దు గ్రామాలైన నర్సీపట్నం మండలం శివారు ప్రాంతం మెట్టపాలెం, కసిరెడ్డిపాలెం, అప్పన్నపాలెం గ్రామాల్లో కాయగూరల సాగులో కాలీఫ్లవర్ కూడా ఒకటి. రెండేళ్లుగా ఇక్కడి రైతులకు ఇది ప్రధాన పంటగా మారింది. ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేయడం, 9 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించారు. ఎకరంలో వేసిన కాలీఫ్లవర్ పంట ద్వారా మార్కెట్లో గిరాకీని బట్టి ఏడాదికి రూ.లక్ష రాబడి వస్తోందని రైతులు చెప్తున్నారు. సొంతంగా సాగు కష్టం చేసే రైతులకు పెట్టుబడి కేవలం రూ.20 వేలు మాత్రమే అవుతుందని, లేకుంటే మరో రూ.10 వేలు అదనంగా వెచ్చించాలంటున్నారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ కావడంతో రైతులు వీటి సాగుపై ఎక్కువగా దృష్టిసారిస్తున్నారు. ఈ ఏడాది ఈ గ్రామాల్లో 30 ఎకరాలకు పైగా కాలీఫ్లవర్ సాగు జరుగుతోంది.

రామాలయం వద్ద భజన కీర్తనలు



కింతలి రామాలయం వద్ద కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: మండలంలోని కింతలి రామాలయం వద్ద భజన మండలి సభ్యులు శ్రీరామ భజన కీర్తనలు ఆలపించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, విశ్వ హిందూ ధర్మ ప్రచార పరిషత్(విశాఖ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న ప్రారంభమైన భజన కీర్తనల ఆలాపన ఆదివారం వరకు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భజన కీర్తనలతో పాటు ప్రత్యేక కుంకమ పూజలు నిర్వహించారు. విశ్వ హిందూ ధర్మ ప్రచార మండల కన్వీనర్ మైచర్ల ఈశ్వరావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాలమ్మ పండగ

మాకవరపాలెం: మండల కేంద్రంలో పట్టాలమ్మతల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తులు తరలి వచ్చి, అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. కొందరు భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన జరిపారు.

కోలాటం చిన్నారులకు దుస్తుల పంపిణీ



ఏకరూప దుస్తులతో చిన్నారులు, నానాజీ, గ్రామపెద్దలు

నాతవరం: విద్యార్థులు చదువు, ఆటపాటలతో పాటు భక్తిభావం అలవర్చుకుంటే చాలా మంచిదని శ్రేయోభిలాషి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు నానాజీ అన్నారు. మండలంలోని చమ్మచింత గ్రామంలో కోలాటం నేర్చుకుంటున్న చిన్నారులకు స్థానికుడైన భాస్కరరావు సమకూర్చిన ఏకరూప దుస్తుల్ని ఆదివారం ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు, చిన్నారులు కోలాటం ద్వారా ప్రజల్లో భక్తిభావం పెంపొందిస్తున్నారని కొనియాడారు. వేసవి సెలవుల్లో చిన్నారులు కోలాటం నేర్చుకోవడంపై దృష్టి పెట్టడం ఆనందంగా ఉందన్నారు. ఒకప్పుడు పెద్దవారికే పరిమితమైన కోలాటం, ప్రస్తుతం చిన్నారుల ప్రదర్శన ద్వారా ఎంతగానో ఆకట్టుకుంటోందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు మేరీ, శ్రీను, భజన సంఘం నాయకులు నాగేశ్వరరావు, అయ్యారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



విద్యార్థులచే పుస్తక పఠనాన్ని నిర్వహిస్తున్న పద్మావతి

కె.కోటపాడు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి పద్మావతి అన్నారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిభిరంలో భాగంగా విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలను చదివి మేధాసంపత్తిని పెంచుకోవాలని విద్యార్థులను సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు



టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో సత్యనారాయణ

- దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బహూకరణ

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేయాలని చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ అన్నారు. ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన 30 మంది విద్యార్థులకు స్థానిక గొల్లవీధి సంఘం కార్యాలయంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారికి సంఘం సీనియర్ సభ్యుడు, ముప్పన సిల్క్ అధినేత ముప్పన సుబ్రహ్మణ్యం ఆర్థిక సహాయంతో నగదు ప్రోత్సాహకం, మొమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేయడం హర్షణీయమన్నారు. ప్రతీ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సంఘం ఆధ్వర్యంలో సత్కరించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు వారిలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో విశాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కాలేపు సదా శివరావు, జిల్లా అధ్యక్షుడు రెడ్డి వరప్రసాద్, కార్యదర్శి బూడిద నాగేశ్వరరావు, జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వైఆర్‌కె. చక్రవర్తి, సభ్యులు అల్లాడ పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్క’రి బిక్కిరి

మాడుగుల రూరల్: రోహిణి కార్తె ఉక్కబోత మరింతగా పెరిగింది. గత కొన్ని రోజులుగా అడపాదడపా వానలు కురిసినా వేడి వాతావరణం మాత్రం కొనసాగుతోంది. శనివారం నుంచి గుబురెండతో పగటిపూట ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వృద్ధులు, చిన్నారులు బయటికి వచ్చేందుకు సాహసించలేకపోయారు. దీనికితోడు అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

28న వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు అనకాపల్లి మండల పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ విచ్చేస్తారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

నేచురో థెరపీతో ఆరోగ్య సంరక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ బాస్మిలా

చోడవరం రూరల్: వ్యాధులు సోకిన తర్వాత మందులు వాడుతూ కలత చెందడం కన్నా వ్యాధులు రాకుండా శరీరాన్ని సంరక్షించుకోవడమే నేచురో థెరపీ విధానమని ఆక్యుపంక్చర్ థెరపిస్టు డా.గొట్టివాడ బాస్మిలా తెలిపారు. ఆదివారం స్థానిక వాకర్స్ క్లబ్ భవనంలో నేచురో థెరపీ, ఆక్యుపంక్చర్ వైద్య విధానం పట్ల అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాభ్యసన, ఓంకారం పఠనం, ధ్యానం వంటివి దైనందిన జీవనంలో ఓ భాగంగా మార్చుకోవాలని సూచించారు. రోజూ వీటిని చేయడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చన్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో పూర్వ అధ్యక్షుడు చిరికి దేవానంద్, విశ్రాంత ఈవోపీఆర్డీ ఆర్.కన్నంనాయుడు, కె.సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. సుగ్గు అప్పలరాజు, ఎ.శ్రీని వాస్‌లు డాక్టర్ బాస్మిలాకు జ్ఞాపికను అందించి, సత్కరించారు.

మోదకొండమ్మ ఘటాల దర్శనానికి బారులు తీరిన భక్తులు



మోదకొండమ్మ ప్రతి రూపమైన ఘటాలను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ నెల రోజుల పండగ సందర్భంగా అమ్మవారు కొలువైన సతకంపట్టు వద్ద ఆదివారం అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో సతకంపట్టు వద్ద పండగ వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ భక్తులకు తాగునీరు తదితర ఏర్పాట్లు చేశారు.

తెలుగు, ఇంగ్లిష్‌పై పట్టు పెంచుకోవాలి



చినదొడ్డిగల్లులో పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి : తెలుగు, ఇంగ్లిష్ భాషలపై విద్యార్థులు పట్టు పెంచుకోవాలని చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణ, సిహెచ్. సతీష్ కోరారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై పలు సూచనలు చేశారు. చిన్న చిన్న పదాలను రాయడం, చదవడం ద్వారా ఇంగ్లిష్ సులభంగా నేర్చుకోవచ్చన్నారు. ఇంగ్లిష్ భాషపై పరిజ్ఞానం పెంచుకుంటే పోటీ పరీక్షలను ఎదుర్కోవడం సులభమన్నారు. దీన్ని గుర్తించి జగనన్న ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టిందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలుగు భాషలో నేర్చుకోవాల్సిన మెలకువలను ఉపాధ్యాయుడు సతీష్ తెలియజేశారు. పద్య పఠనం, పుస్తక పఠనం ద్వారా ఈ రెండు భాషలపై పట్టు సాధించవచ్చన్నారు. వేసవి కాలంలో విద్యార్థుల కోసం గ్రంథాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసిన గ్రంథాలయాధికారి జనార్దన్‌ను వారు అభినందించారు. ఇక్కడ వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలతో పాటు, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పుస్తకాలు, ప్రపంచం నలుమూలలా ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు పత్రికలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంగ్లిష్ పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని, గ్రామర్‌పై పట్టు సాధించాలని సూచించారు. శిబిరానికి వచ్చే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలతో పాటు, చిత్రలేఖనం పోటీలు కూడా నిర్వహించడం జరుగుతోందని జనార్ధన్ తెలిపారు. ఈ శిబిరానికి ఉపాధ్యాయులు వచ్చిన విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం అభినందనీయమన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ

రాంబిల్లి: మండలంలో కుమ్మరాపల్లి గ్రామంలో ఆదివారం దుర్గాలమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

భగవద్గీత చదివించండి

మునగపాక : ప్రతి ఒక్కరూ భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలని ఆదినారాయణ స్వామి రాజ యోగాశ్రమం ట్రస్టీ కుమార్ కోరారు. మండలంలో గల తోటాడ గ్రామంలో ఆదివారం రాజ యోగాశ్రమం ఆధ్వర్యంలో భగవద్గీతపై అవగాహన కలిగించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు కూడా పిల్లలను భగవద్గీతపై శిక్షణను పోత్సహించాలన్నారు. తద్వారా పిల్లల్లో మేధాశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



బూరుగుపాలెం హైస్కూల్ 2006-07 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

మాకవరపాలెం: మండలంలోని బూరుగుపాలెం ఉన్నత పాఠశాలలో 2006-07లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. దీనికి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు హాజరై, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఒకరినొకరు గుర్తుపట్టి మరీ పరిచయం చేసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని, పరస్పర యోగ క్షేమాలను తెలుసుకున్నారు. ఈ సమ్మేళనంలో సుమారు 30 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాసనాలతో ఆరోగ్యం

అనకాపల్లి: ఆహారం తీసుకున్నంత కాలం ఆసనాలు, ప్రాణం ఉన్నంత వరకూ ప్రాణాయామం చేయాలని పతంజలి హరిద్వార్ తెలుగు ఉమ్మడి రాష్ట్రాల పర్యవేక్షకులు స్వామి రితిదేవ్ మహారాజ్‌జీ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఆదివారం పతంజలి వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా నేర్చుకున్న వ్యక్తులు శిక్షకులుగా వెళ్లవచ్చని పేర్కొన్నారు. దేశంలో సంస్కృతి సంప్రదాయాలు కాపాడడానికి పంతంజలి హరిద్వార్ భారతీయ శిక్షణ బోర్డు కృషిచేస్తుందన్నారు. కరోనా సమయంలో అతి తక్కువ ఖర్చుతో పతంజలి హరిద్వార్ ఆయుర్వేదిక్ మందులు తయారుచేసి ఎంతో మందిని కాపాడిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యోగా సభ్యులు, జార్జిక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.